
# ఫ్లాష్ బ్యాక్




పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# కడారు నాగభూషణం

## (చిత్ర 1964, సంచిక నుంచీ)

## రజితోత్సవ నిర్మాత శ్రీ కె.బి.నాగభూషణం



గత 25 సంవత్సరాలుగా, తెలుగు, తమిళం, కన్నడం, భాషల్లో 25 చిత్రాలు నిర్మించిన శ్రీ కడారు నాగభూషణం దక్షిణాది నిర్మాతల్లో ప్రముఖులు. ఆయన చేతిక్రింద అనేకమంది నటీనటులు, దర్శకులు తయారైనారు. దక్షిణ భారతదేశంలో ఫిలిం పరిశ్రమకు రూపురేఖలు దిద్దటంలోనూ, దాని అభివృద్ధికి తోడ్పడటంలోనూ ఆయనెంతో కృషి చేశారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఎంతో మంది ఎన్నో వ్యాపార విషయాలు నేర్చుకోవలసి ఉంది. దక్షిణాదిన ఒకే నిర్మాత నాగభూషణంగారు నిర్మించినన్ని చిత్రాలు నిర్మించ లేదంటే అతిశయోక్తి కాదు.

శ్రీ కడారు నాగభూషణం గారు ప్రస్తుతం నిర్మిస్తున్నది 26వ చిత్రం. ప్రస్తుతం ముగింపు దశలో నున్న ఈ చిత్రమే గాక, అనతి కాలంలోనే యింకా ఎన్నో చిత్రాలను నిర్మించేందుకు నాగభూషణం గారు పథకాలు వేశారు. త్వరలో వరలక్ష్మీ పిక్చర్స్ బేనర్ లో తమ 27 వ చిత్రాన్ని నిర్మించేందుకు జెమినీ ఆధినేత శ్రీ వాసన్ తో భాగస్వామిగా 28 వ చిత్రాన్ని నిర్మించేదుకు, సుందర్ లాల్ నహతా తో భాగస్వామి గా 'ద్రౌపది' వర్ణచిత్రాన్ని ఈ సంవత్సరాంతంలోగా ప్రారంభించేందుకు పథకాలు తయారైనవి. ఈ వర్ణచిత్రంలో తెలుగు తెరపై కనిపించే ప్రముఖ నటీనటులంతా ఉంటారు.

1948 వ సంవత్సరంలో ఆయన తమిళంలో నిర్మించిన 'నవజీవనం' చిత్రం మద్రాసు ప్రభుత్వపు సువర్ణ పతకాన్ని అందుకుంది. కడారు వారి అనేక చిత్రాలు ఆర్థిక విజయాన్ని పొందినవి.

కృష్ణా జిల్లాలోని కోలవెన్ను గ్రామంలో 58 సంవత్సరాల క్రితం, ధనిక భూస్వామి అయిన కడారు భగవానులుగారి పుత్రుడైన నాగభూషణంగారు ఇంటర్మీడియట్ వరకు విద్య నభ్యసించారు. ఆయన గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. తరువాత విజయవాడ లోని హిందూ హైస్కూలులో చదువుకొన్నారు. బందరులోని నోబుల్ కళాశాలలో ఉన్నత విద్య నభ్యసించారు. తెలుగు ఫిలిం పరిశ్రమకు రూపు రేఖలు దిద్ది సౌత్ ఇండియన్ ఫిలిం ఛేంబరు ఆఫ్ కామర్స్ కు మూలపురుషుడైన క్రీ. శే. గూడవల్లి రామబ్రహ్మం కాలేజ్ లో నాగభూషణంగారికి సహాధ్యాయి. విద్యార్థిగానుండగానే, నాగభూషణం గారికి నాటకాలన్నా, సంగీతమన్నా అభిరుచి ఎక్కువగా ఉండేది. 'బొబ్బిలి యుద్ధం'లో బుస్సీగానూ, 'చింతామణి' లో బిల్వమంగళుడుగా ఆయన నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. కాలేజీ చదువు కాగానే, ఆయన 'సీతారామాంజనేయ సమాజం' అనే సంస్థను ఇందుపల్లి గ్రామంలో స్థాపించి సావిత్రి, బొబ్బిలి నాటకాలను ప్రదర్శించి ప్రజా మన్ననలను పొందారు.

తర్వాత 1929 వ సంవత్సరంలో బాలమిత్ర సమాజంతో పరిచయ మేర్పడి, వారితో ఆంధ్ర, మైసూరు రాష్ట్రాలంతా 1932 వ సంవత్సరం వరకూ ప్రదర్శనలిస్తూ తిరిగారు. 1934 వ సంవత్సరంలో శ్రీమతి పసుపులేటి కన్నాంబతో పరిచయ మేర్పడింది. ఆ రోజుల్లో ఆమె రంగస్థలం మీద అఖండ కీర్తినార్జించింది. ఆమెతో కలసి శ్రీ రాజరాజేశ్వరీ నాట్య మండలిని స్థాపించారు. ఆ సమాజంలో ఆనాటి ప్రముఖ రంగస్థల నటులు వేమూరి గగ్గయ్య, సూరిబాబు, దొమ్మేటి సూర్యనారాయణ, రఘురామయ్య, కన్నాంబ, ఋష్యేంద్ర మణి తదితరులంతా ఉండేవారు. ఈ సంస్థ మేనేజరుగా నాగభూషణం గారు 5 సంవత్సరాలు యావద్భారతదేశం పర్యటించారు. తత్ఫలితంగా ఆయన నాటక రంగ ప్రేక్షకుల నాడిని గ్రహించ గలిగారు.

1936-37 సంవత్సరాలలో విజయవాడ లోని సరస్వతీ టాకీసుతో వారికి పరిచయ మేర్పడింది. అప్పుడు వారు తెలుగులో నిర్మిస్తున్న 'కనకతార' చిత్ర నిర్మాణంలో నాగభూషణం గారు సహకరించారు. 1939 వ సంవత్సరంలో విజయవాడలోని కీ శే కురుకూరి సుబ్బారావు, మానికొండ నరసింహం గార్లతోనూ, కన్నాంబతోనూ కలసి 'భవానీ పిక్చర్సు' ను స్థాపించి 'చండిక' చిత్రాన్ని నిర్మించారు. 1940 వ సంవత్సరంలో శ్రీ రాజరాజేశ్వరీ పిక్చర్స్ అనే మరొక సంస్థను వారి యితర మిత్రుల సహకారంతో స్థాపించి 'సుమతి' 'తల్లిప్రేమ' చిత్రాలను జెమినీ స్టూడియోలో నిర్మించారు. 1943 వ సంవత్సరంలో ఆ కంపెనీ పేరును 'శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ' గా మార్చి భాగస్థులెవరూ లేకుండా మొత్తం కంపెనీకి ఆయనే సారధ్యం వహించారు.

నాగభూషణం గారి పై ఎస్.ఎస్.వాసన్ కు ఎనలేని అభిమానం, వాసన్ తో భాగస్వామిగా ఆయన జెమినీ స్టూడియోలో 7 చిత్రాలను నిర్మించారు. (హరిశ్చంద్ర; తులసీ జలంధర్ తమిళం లోనూ, లక్ష్మీ, సౌదామిని, తెలుగు తమిళ భాషల్లోనూ, పాదుకా పట్టాభిషేకం తెలుగులోనూ నిర్మించారు. 1956 వ సంవత్సరంలో ఎస్.ఎస్. వాసన్ తో కలిసి వరలక్ష్మీ పిక్చర్స్ అనే మరొక సంస్థను నెలకొల్పి 8 చిత్రాలను నిర్మించేరు. సావిత్రి చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడం భాషల్లోనూ; వీరభాస్కరుడు, ధర్మమే జయం తెలుగు భాష లోనూ నిర్మించారు.) ఇవి-గాక రాజరాజేశ్వరీ బేనర్ లో 5 చిత్రాలను కూడా నిర్మించారు. (సక్కు బాయి; అన్న తమ్ముడు, శ్రీకృష్ణ మాయ, శ్రీకృష్ణ తులాభారం, ఉషా పరిణయం చిత్రాలు.) 1952 వ సంవత్సరములో శ్రీ సుందర లాల్ నహతాతో పరిచయం కలిగింది. నాగభూషణం గారి అనేక చిత్రాలకు సుందర లాల్ ఎంతగానో సహకరించారు. ప్రస్తుతం నిర్మాణంలో నున్న 26 వ చిత్రంలో సుందర లాల్ కూడా ఒక భాగస్థుడే.

నాగభూషణంగారు నిర్మించిన అన్ని చిత్రాలకు వారే దర్శకులు కూడా. మొదట ఆయన నిర్మించిన 'చండిక' చిత్రానికి దర్శకత్వం వహించిన స్వర్గీయ ఆర్.ఎస్.ప్రకాష్ దగ్గర్నుంచి ఆయన చాలా మెళకువలు నేర్చుకున్నారు ప్రస్తుతం ప్రముఖ దర్శకుడుగా ఉన్న సి. ఎస్. రావు, తమిళనాడులోని రామకృష్ణ, కన్నడ చిత్ర దర్శకుడు జి.ఆర్.రావు నాగభూషణం గారి దగ్గిర ఆసిస్టెంట్లుగా పని చేసినవారే. తెలుగు ఫిలిం పారిశ్రామికుల్లో ప్రముఖులైన కీ.శే. పారుపల్లి శేషయ్య గారు, నాగభూషణం గారిని దర్శకుడుగా వుండమని ప్రోద్బలపరిచారని, ఆయనపై తనకెంతో గౌరవభావమున్నదనీ నాగభూషణం గారు అంటుంటారు.

తమిళంలో చిత్రాలను తాను నిర్మించటానికి వాసన్ గారే ముఖ్య కారకులని నాగభూషణంగారు అంటూంటారు, తన చిత్ర నిర్మాణానికి అవసరమైన సదుపాయాలను, ఆర్థిక సహాయాన్ని వాసన్ గారే ఏర్పాటు చేశారని ఆయన అంటారు. వాసన్ తో పరిచయం కలిగినది మొదలు, ఆయన తనకు అన్నివిధాల తోడ్పడుతూ, ఉత్సాహపరుస్తుండేవారని, ఆయనపై తనకెంతో గౌరవమున్నదనీ యిప్పటికీ ఆయన అంటారు.

1953వ సంవత్సరంలో మొదటి సారిగా తను సుందర్ లాల్ ను కలుసుకున్నది మొదలు ఆయనపై తనకు ఎంతో గౌరవము ఏర్పడిందని నాగభూషణం గారు చెప్పారు. “సుందర్ లాల్ నహతా గారి విలువైన సలహాలు, సహాయమూ నాకెంతో ధైర్యాన్నిచ్చాయి. ఆ ధైర్యంతో నేను ఫిలిం నిర్మాణంలో ముందుకు పోగలిగాను” అన్నారు. అనేక పరిస్థితుల్లో తాను ఆర్థికంగా, మానసికంగా దిగజారిపోయినప్పుడు, సుందర్ లాల్ నాకెంతో ధైర్యాన్నిచ్చి నాకు మానసిక బలాన్నిచ్చారు. ఆయన నిర్మించిన దాదాపు అన్ని చిత్రాలను సుందర్ లాల్ ఆధ్వర్యంలో నున్న కంపెనీలే డిస్ట్రిబ్యూట్ చేశాయి. ఏ ఒక్క నిర్మాతా తనిచ్చినన్ని చిత్రాలను సుందర్ లాల్ కు యివ్వలేదని ఆయన అంటారు. సుందర్ లాల్ జీ హుందాగల వ్యక్తి. మా ఆఫీసులో ఆయన చిత్ర మొక్కటే అలంకరించబడి ఉంది. ఆయనలోని హుందాతనమూ అదృష్టం నాకూ అబ్బాలని ప్రార్థిస్తాను అన్నారు నాగభూషణంగారు.

దాదాపు గత మూడు దశాబ్దాలుగా నిర్మాతగా తన అనుభూతులను స్మరణకు తెచ్చుకుంటూ నాగభూషణంగారిలా అన్నారు. “దక్షిణాదిన ఫిలిం పరిశ్రమ పుట్టిన దగ్గర్నుంచి, వస్తున్న పరిణామాలన్నింటినీ చూస్తూనే ఉన్నాను. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేను పాత కాలపు వాణ్ని అవటం వలన ఈ నాటి పరిస్థితులలో సర్దుకోలేకపోతున్నాను. ఈనాటి పరిస్తితుల్లో నిర్మాత బ్రతుకు అస్తవ్యస్తంగా ఉంది నిర్మాణ ఖర్చులు పెరిగి పోతున్నాయి. నటీనటుల కిచ్చే రేట్లు కూడా తారాపథాన్నందుకుంటున్నాయి. ప్రేక్షకులు కూడా స్టార్ వేల్యూకే ఎక్కువ ప్రాముఖ్యతనిస్తున్నారు. పరిశ్రమలో వచ్చే నష్టాలన్నింటినీ నిర్మాతే భరించ వలసి వస్తోంది. డిస్ట్రిబ్యూటరు, ఎగ్జిబిటరు కూడా నిర్మాతతో సహకరించి ఆదుకోకపోతే భవిష్యత్తులో నిర్మాత చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఫిలిం పరిశ్రమపై సానుభూతిని ప్రదర్శించకుండుట వల్ల పన్నుల రేట్లు పెరిగిపోవడం, ఫిలిం పరిశ్రమపై అనేక నిర్బంధాలు పెట్టటంవల్ల నిర్మాతలకు నిరుత్సాహం కలుగుతోంది. 25 చిత్రాలను నిర్మించిన తర్వాత (వీటిలో చాలావరకు జయప్రద మైనవే) కూడా నాకు కలిగిన నష్టం లక్షల్లో ఉంది. ఫిలిం పారిశ్రామికులంతా నిర్మాత పడుతున్న ఆగచాట్లను గ్రహించి, దీనికేదోఒక మార్గాన్ని అన్వేషించాలి. విపరీతమైన రేట్లను కోరే నటీనటులను తీసుకొనక పోవటం; 2 లక్షలకు మించకుండా చిత్రనిర్మాణాన్ని ముగించటం; ఈ రెండే ఫిలిం పరిశ్రమాభివృద్ధికి ఉపకరించే చిట్కాలు. ఇక ముందైనా తారాగణం కంటే చిత్రంలోని విలువలే ఎక్కువ ప్రాధాన్యం వహించాలని, భావి భారతదేశ సౌభాగ్యం దృష్ట్యా ఉత్తమ చిత్రాలను నిర్మించేందుకు, అందువల్ల నిర్మాత నష్టపడకుండా ఉండేట్టుగా ఫిలిం పారిశ్రామికవేత్తలంతా తగు మార్గాలను అన్వేషించాలని కోరుచున్నాను” అన్నారు నాగభూషణంగారు.

*రచన: శ్రీ మల్లాది ఫణిభూషణ రావు*

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS